తరంగాలు
రిపోర్టర్లు కావలెను
అతి తక్కువ కాలంలో తెలుగు రాష్ట్రాల్లో అత్యంత ప్రజాదరణ పొందుతున్న ' తరంగాలు ' జాతీయ దినపత్రిక నందు పనిచేయుటకు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లోని అన్ని జిల్లాలోని అన్ని మండలాల నుండి రిపోర్టర్లు కావలెను.
సంప్రదించండి...
94949 23460

ఎడిటర్ : గడ్డం నాగరాజు
RNI . TELTEL / 2022 / 83463
జాతీయ దిన పత్రిక
# తరంగాలు
Tharangalu Daily News Paper
ప్రతి అక్షరం.... సామాన్యుడి అస్త్రం...
హైదరాబాద్
ఆదివారం
25 ఫిబ్రవరి 2024
సంపుటి : 01
సంచిక :268
పేజీలు : 8
వెల రూ.5.00
Epaper : WWW.tharangalu.com
Published From: Hyderabad,Circulated: Hyderabad,Nalgonda,Khammam,Rangareddy,sangareddy,Warangal,Kurnool,Kadapa,Amaravathi,Krishna

## ఎన్నికల వేల బీఆర్ఎస్‌కు భారీ షాక్



- కాంగ్రెస్‌లోకి క్యూ కడుతున్న నేతలు
- డిప్యూటీ మేయర్ శ్రీలతతో పాటు మరో ఆరుగురు బీఆర్ఎస్ నేతలు క్యూ

తరంగాలు- హైదరాబాద్ :

తార్నాక డివిజన్ కార్పొరేటర్, డిప్యూటీ మేయర్ మోతే శ్రీలత శోభన్ రెడ్డి దంపతులు సీఎం రేవంత్ రెడ్డి, రాష్ట్ర కాంగ్రెస్ ఇంచార్జ్ దీపాదాస్ మున్షీ సమక్షంలో ఫిబ్రవరి 25న ఆదివారం కాంగ్రెస్ లో చేరనున్నట్లు తెలుస్తోంది. ఈ విషయాన్ని డిప్యూటీ మేయర్ కార్యాలయ సభ్యులు వెల్లడించారు. కాగా కొద్ది రోజులుగా బీఆర్ఎస్ పార్టీ నాయకత్వం పట్ల అసంతృప్తితో ఉన్న డిప్యూటీ మేయర్ పార్టీ మారేందుకు సిద్ధమయ్యారు. ఈమేరకు రాజీనామా లేఖను పార్టీ అధినేతకు పంపించారు. పార్టీలో ఉద్యమకారులకు మనగాడలేదంటూ రాజీనామా లేఖలో మోతే దంపతుల ఆవేదన వ్యక్తం చేశారు. డిప్యూటీ మేయర్ శ్రీలతతో పాటు మరో ఆరుగురు బీఆర్ఎస్ కార్పొరేటర్లు కాంగ్రెస్ లో చేరనున్నట్లు తెలుస్తోంది. ఇక మాజీ హైదరాబాద్ మేయర్, -మిగతా 2 లో

## వనంలోకి తల్లులు




- కన్నెపల్లికి సారలమ్మ, చిలకలగుట్టకు సమక్కొముగిసిన మేడారం జాతర

తరంగాలు-ములుగు

మేడారంలో జనం నుంచి వనదేవతలు వనంలోకి చేరారు. సారలమ్మ రాక తర్వాత మహాజాతర ప్రారంభమైన సంగతి తెలిసిందే. ఆ మరుసటి రోజు సమ్మక్కను గద్దెపైకి తీసుకురాగా.. శుక్రవారం వన దేవతలకు మొక్కులు సమర్పించారు. శనివారం ఇద్దరు తల్లులు వన ప్రవేశం చేసారు. కన్నెపల్లికి సారలమ్మ, చిలకలగుట్టకు సమక్క చేరుకోవడంతో జాతర ముగిసింది. జాతర నేపథ్యంలో.. దేశం నలుమూలల నుంచి వచ్చిన జనం మొక్కులు చెల్లించారు. శనివారం సమ్మక్క సారలమ్మ, పగిడిద్దరాజు, గోవిందరాజును గద్దెలపై నుంచి ఆదివాసీ పూజారులు వారి వారి ఆలయాలకు తీసుకెళ్లారు. సమ్మక్క ప్రతిరూపమైన -మిగతా 2 లో


## అభ్యర్థుల మొదటి జాబితా విడుదల



- మరో ముందడుగు వేసిన టీడీపీ, జనసేన
- కుప్పంలో పోటీ చేసేది ఎవరు నారా భువనేశ్వరినా లేక చంద్రబాబు నాయుడా
- మొదటి జాబితాలో మొత్తం 118 సీట్లను ప్రకటించిన టీడీపీ, జనసేన
- భువనేశ్వరి కుప్పంలో పోటీచేస్తే చంద్రబాబు ఎక్కడి నుంచి పోటీ చేస్తారు
- జనసేన 24 స్థానాల్లో పోటి

తరంగాలు -అమరావతి

ఏపీ అసెంబ్లీ ఎన్నికలకు సమయం దగ్గరపడుతోంది దీంతో అధికార పార్టీ వైసీపీ 175 అసెంబ్లీ స్థానాలకు దాదాపు అన్ని స్థానాలకు ఇప్పటికే అభ్యర్థులను ప్రకటించింది. ఈ క్రమంలో టీడీపీ, జనసేన కూటమి కూడా మరో ముందడుగు వేసింది. ఏపీలో టీడీపీ, జనసేన కూటమి పోటీ చేయబోయే స్థానాలు, అభ్యర్థుల మొదటి జాబితా విడుదల చేసింది. మొదటి జాబితాలో మొత్తం 118 సీట్లను ప్రకటించారు టీడీపీ అధినేత చంద్రబాబు, జనసేన అధ్యక్షుడు పవన్ కళ్యాణ్. టీడీపీ నుంచి మొత్తం 94 మంది అభ్యర్థులు, జనసేన 24 స్థానాల్లో పోటీ చేయబోతున్నట్టు ప్రకటించారు. మూడు పార్లమెంట్ స్థానాల్లోనూ జనసేన పోటీ చేయబోతోంది. ఈ క్రమంలో 5 అసెంబ్లీ స్థానాల్లో మాత్రమే జనసేన అభ్యర్థులను ప్రకటించింది. అయితే, కుప్పంలో నారా భువనేశ్వరినా లేక చంద్రబాబు నాయుడా పోటీ చేసేది ఎవరు అన్న ఉత్కంఠకు తెరపడింది. కుప్పం నుంచి తానే పోటీ చేయనున్నట్లు టీడీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్వయంగా ప్రకటించుకున్నారు. దీంతో కుప్పం బరిలో ఉండేదెవరో తేలిపోయింది. దీనంతటికి ప్రధాన కారణం ఇటీవల టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు సతీమణి నారా భువనేశ్వరి ఆసక్తికర వ్యాఖ్యలు చేయడం ఈసారి -మిగతా 2 లో




## ఇందిరమ్మ రాజ్యం అంటే ఎన్‌కౌంటర్లు కాల్చివేతలు

- రేవంత్ రెడ్డి పాలనలో దళిత బహుజన జర్నలిస్టులే లక్ష్యంగా దాడులు
- నయా దేశ్‌ముఖ్ రేవంత్ రెడ్డి
- కాంగ్రెస్ గుండాలపై బాల్క సుమన్ ఫైర్

తరంగాలు- హైదరాబాద్ :

ప్రశ్నించే గొంతుకలపై కాంగ్రెస్ పార్టీ గుండాలు దాడులు చేయడం సరికాదని బీఆర్ఎస్ నాయకుడు బాల్క సుమన్ అన్నారు. తెలంగాణ భవన్‌లో బాల్క సుమన్ మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో నిజంగానే ఇందిరమ్మ రాజ్యం నడుస్తోందని ధ్వజమెత్తారు. ఇందిరమ్మ రాజ్యం అంటే ఎన్‌కౌంటర్లు.. కాల్చివేతలు అని తెలిపారు. ప్రశ్నించే గొంతుకలపై ప్రజాపాలన అని చెప్పుకుంటూ దాడులు చేస్తున్నారు. సీనియర్ జర్నలిస్టు శంకర్‌పై కాంగ్రెస్ గుండాలు పథకం ప్రకారం దాడి చేశారు. చంపాలని పాశవికంగా దాడికి పాల్పడ్డారు. ఇలాంటి పాశవిక దాడిని -మిగతా 2 లో



## అంతరిక్షంలోకి మనుషులను తీసుకెళ్లడానికి సీఈ20

తరంగాలు/డెస్క్


భారత్ ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన గగన్‌యాన్ ప్రాజెక్టులో మరో ముందడుగు పడింది. అంతరిక్షంలోకి మనుషులను సురక్షితంగా తీసుకెళ్లడానికి అనువైన సీఈ20 క్రయోజనిక్ ఇంజిన్‌ను ఇస్రో సిద్ధం చేసింది. ఈ విషయమై ఇస్రో ఎక్స్ ఖాతాలో అప్‌డేట్ ఇచ్చింది. క్రయోజెనిక్ ఇంజిన్ తుది పరీక్షలను విజయవంతంగా పూర్తి చేసినట్లు తెలిపింది. నింగిలోకి వ్యోమగాములను పంపేందుకు వినియోగించే ఎల్‌వీఎం3 లాంచ్ వెహికల్‌లో దీనిని వాడనున్నారు. సీఈ20 క్రయోజనిక్ ఇంజిన్ గగన్‌యాన్‌లో మానవ ప్రయాణానికి -మిగతా 2 లో



## లోకల్ ట్రైన్‌లో ఆర్థిక మంత్రి

తరంగాలు ముంబయి :

గల్లీ నేతల నుంచి దిల్లీ నాయకుల వరకు తమకు ఎప్పుడైనా కాస్త విరామ సమయం దొరికితే చాలు.. నచ్చింది చేస్తుంటారు. ఇందుకు కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ మినహాయింపేమీ కాదు. దేశార్థికాభివృద్ధి కోసం అహర్నిశలు పని చేసే ఆమె.. లోకల్ ట్రైన్ లో ప్రయాణించడం విశేషం. ముంబయి లోకల్ ట్రైన్‌లో ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఎక్కారు. దీంతో అక్కడున్న సాధారణ ప్రయాణికులు ఆశ్చర్యపోయారు. కేంద్ర మంత్రి తమతో కలిసి ప్రయాణం చేయడాన్ని వారు నమ్మలేకపోయారు. అంతే కాకుండా మంత్రి నిర్మల.. వారితో సరదా కబుర్లు చెప్పారు. చివర్లో అందరితో ఆమె సెల్ఫీ దిగారు. ఘట్‌కోపర్ నుంచి కళ్యాణ్ వరకు లోకల్ ట్రైన్ లో ఆమె ప్రయాణించారు. ఇందుకు సంబంధించిన ఫొటోలను ట్విట్టర్లో ట్వీట్ చేయడంతో అవి వైరల్ గా మారాయి.



## బీజేపీ పెద్దలతో భేటీ కానున్న తెలంగాణ నేతలు

తరంగాలు హైదరాబాద్

నేడు ఢిల్లీకి తెలంగాణ బీజేపీ నేతలు వెళ్లనున్నారు. కిషన్ రెడ్డి, బండి సంజయ్, లక్ష్మణ్, డీకే అరుణ , ఈటల తదితరులు సాయంత్రం బీజేపీ అగ్రనేతలతో సమావేశం కానున్నారు. పార్లమెంట్ అభ్యర్థుల ఎంపికపై అధిష్టానంతో బీజేపీ నేతలు చర్చించనున్నారు. మార్చి రెండో వారంలో అభ్యర్థుల ప్రకటన చేయాలని బీజేపీ భావిస్తోంది. హైకమాండ్ వద్ద ఒక్కో నియోజకవర్గం నుంచి మూడు పేర్లతో లిస్ట్ రెడీ చేయనున్నారు. -మిగతా 2 లో

## న్యాయస్థానం చురకలు పెట్టినా మారని ప్రభుత్వ తీరు




- సమాఖ్య స్ఫూర్తిని దెబ్బతీస్తున్న కేంద్ర రాష్ట్ర దర్యాప్తు సంస్థలు
- సమన్యాయ పాలన నేతి బీరలోని నెయ్యి వంటిదే
- సంస్కరణ, ప్రక్షాళన జరిగి ప్రజలకు పార్లమెంటుకు జవాబుదారీ అయినప్పుడే ఈ సంస్థల స్వతంత్రత సాధ్యం
- సామాజిక రాజకీయ విశ్లేషకులు : వడ్డేపల్లి మల్లేశం

తరంగాలు డెస్క్:

ప్రస్తుత కేంద్ర ప్రభుత్వ హయాములో సిబిఐ, ఇడి ప్రతిపక్షాలకు సంబంధించిన నాయకులపై దాడులకు పాల్పడినట్లుగా అనేక ఆరోపణలు ఉన్నాయి. ఈ విషయాన్ని రుజువు చేస్తూ 14 రాజకీయ పార్టీలు 2023 సంవత్సరంలో కేంద్రం దర్యాప్తు సంస్థల్ని తమపైకి ఉసుగొల్పుతున్నాయని సర్వోన్నత న్యాయస్థానానికి మొరపెట్టుకొనీ -మిగతా 2 లో

# అభ్యర్థుల మొదటి జాబితా విడుదల



-మెదటి తరువాయి

ఎన్నికల్లో చంద్రబాబుకు బదులు తాను కుప్పం నుంచి పోటీ చేయబోతున్నట్లు ప్రకటించారు. నిజం గెలవాలి యాత్రలో భాగంగా చిత్తూరు జిల్లాలోని కుప్పం నియోజకవర్గంలోని పర్యటించిన భువనేశ్వరి తనకు మనసులో ఒక కోరిక కలిగిందని 35 ఏళ్లుగా ఎమ్మెల్యేగా ఉన్న చంద్రబాబుకి ఈసారి కుప్పంలో విశ్రాంతి ఇచ్చి తాను పోటీ చేయాలని అనుకుంటున్నట్లు ప్రకటించారు. దీంతో కుప్పం నుంచి ఎవరు పోటీ చేస్తారన్న విషయం హాట్ టాపిక్ గా మారింది. నారా భువనేశ్వరి కుప్పంలో పోటీచేస్తే చంద్రబాబు ఎక్కడి నుంచి పోటీ చేస్తారు. ఏ నియోజవర్గం అయితే బాగుంటుంది అనే ఊహగానాలు మొదలయ్యాయి ఈ క్రమంలోనే వాటన్నింటికి చెక్ పెడుతూ చంద్రబాబు తానే పోటీచేస్తున్నట్లు చెప్పడంతో కుప్పం అభ్యర్థి ఎవరన్నది క్లారిటీ వచ్చింది.


# బీజేపీ పెద్దలతో భేటీ కానున్న తెలంగాణ నేతలు

-మెదటి తరువాయి

సిట్టింగ్‌లు కిషన్ రెడ్డి, బండి సంజయ్, ధర్మపురి అర్వింద్, సోయంకు మళ్ళీ అవకాశం లభించనుంది. మల్కాజ్‌గిరి నియోజకవర్గానికి బీజేపీలో తీవ్ర పోటీ నెలకొంది. మల్కాజ్‌గిరి సీటును ఈటల, చాడా సురేష్ రెడ్డి, పన్నాల హరీష్ రెడ్డి, వీరేందర్ గౌడ్, కూన శ్రీశైలం గౌడ్ తదితరులు ఆశిస్తున్నారు. మహబూబ్‌నగర్ స్థానంలో డీకే అరుణ, శాంతికుమార్, జితేందర్ రెడ్డి మధ్య పోటీ నెలకొంది. ఖమ్మం సీటును పీవీ రమేష్, గల్లా సత్యనారాయణ, రంగా కిరణ్‌లు ఆశిస్తున్నారు. చేవెళ్ళ నుంచి కొండా విశ్వేశ్వరెడ్డి, భువనగిరి నుంచి బూర నర్సయ్య గౌడ్ పోటీ దాదాపు ఖరారు అయ్యారు.

## ఎన్నికల వేల

# బీఆర్ఎస్‌కు భారీ షాక్



-మెదటి తరువాయి

మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణా రెడ్డి సైతం కాంగ్రెస్ పార్టీ చేరనున్నట్లు తెలుస్తోంది. ఆయన కోడలు రంగారెడ్డి జడ్పీ చైర్ పర్సన్ తీగల అనితా రెడ్డితో కలసి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసుకున్నారు. త్వరలో వీరిద్దరూ బీఆర్ఎస్ పార్టిని వీడి కాంగ్రెస్ చేరనున్నట్లు తెలుస్తోంది. వీరితో మాజీ మంత్రి పట్నం మహేందర్ రెడ్డి సైతం సీఎం రేవంత్‌ను కలుసుకున్నారు. ఇక ఇప్పటికే పట్నం మహేందర్ రెడ్డి సతీమణి వికారాబాద్ జెడ్పీ ఛైర్మన్ పట్నం సునీతారెడ్డి కాంగ్రెస్ గూటికి చేరారు. మరోవైపు మాజీ ఎమ్మెల్సీ, సీనియర్ దళిత నాయకుడు డీ రాజేశ్వర్‌రావు కాంగ్రెస్ గూటికి చేరారు. శనివారం సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి పార్టీలో చేరుతున్నట్టు ప్రకటించారు. చాలకాలం పాటు ఆయనకు ఎమ్మెల్సీగా కొనసాగిన అనుభవం ఉంది. దివంగత నేత రాజశేఖర్‌రెడ్డికి అత్యంత ఆత్మీయుడిగా పేరు గడించారు. వరుసగా నాలుగు సార్లు ఎమ్మెల్సీగా చేశారు. గత ప్రభుత్వంలో మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి ఫాలోవర్‌గా ఉన్నారు.

# మృతుల కుటుంబాలను పరామర్శించ

• ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు





**తరంగాలు/వర్ధన్నపేట:** ఐనవోలు మండల కేంద్రానికి చెందిన జంపాల వెంకటమ్మ అనారోగ్యంతో మృతి చెందింది. విషయం తెలుసుకున్న వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు వెంకటమ్మ భౌతిక దేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం పెరుమండ్లగూడెం గ్రామంలో ఇటీవల మృతి చెందిన పిడుగు చిన్న కొమ్మురమ్మ కుంటంబసభ్యులను, రాంనగర్ గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ కార్యకర్త బర్ల రాజు కుమారడు బర్ల గోపాల్ ఈతకు వెళ్లి చెరువులో పడి మృతి చెందగా వారి కుటుంబ సభ్యులకు మరియు అదే గ్రామానికి చెందిన మహమ్మద్ రషీద్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మరణించగా వారి కుటుంబ సభ్యులను పరామర్శించి, ప్రగాఢ సానుభూతి తెలిపారు. ప్రభుత్వం తరఫున అన్ని విధాలుగా ఆదుకుంటామని ఎమ్మెల్యే నాగరాజు బాధిత కుటుంబాలకు మనో దైర్యం కలిగించారు. ఎమ్మెల్యే వెంట మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సమ్మెట మహేందర్ గౌడ్, గడ్డం శివరాం ప్రసాద్, ఐనవోలు మండల గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు

# న్యాయస్థానం చురకలు పెట్టినా మారని ప్రభుత్వ తీరు

-మెదటి తరువాయి

తమ కోసం ప్రత్యేక మార్గదర్శకాలు జారీ చేయాలని కోరినప్పటికీ చట్టం ముందు ప్రజలు రాజకీయ నాయకులు సమానమేనని ప్రత్యేక ఆదేశాలు సాధ్యం కాదని కొట్టివేసిన తీరు న్యాయస్థానం చొరవను ఈ సందర్భంగా స్వాగతించవలసి ఉన్నది. చట్టం ముందు అందరూ సమానులేననీ "సమ న్యాయ పాలనలి సిద్ధాంతం హెచ్చరిస్తుంటే అధికారంలో ఉన్న వారి అణుంగు సహ చర్లకు అధిక ప్రాధాన్యతను ఇవ్వడంతో పాటు చట్టం తన పని తాను చేసుకుపో తుందని దర్యాప్తు సంస్థల గురించి కేంద్రం చిలుక పలుకులు పలికినా పక్షపాత ధోరణికి మాత్రం కొదవలేదు. ఇందులో భాగమే అనేక సార్లు కేసుల వాయిదా తో పాటు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి వంటి అవినీతిపరులు ముఖ్యమంత్రిగా కొనసాగుతూ దోపిడిని చట్టబద్ధం చేసిన తీరు చూస్తే కేంద్ర దర్యాప్తు సంస్థలు చోద్యం చూస్తున్నాయా! అని అనిపించక మానదు. ముఖ్యంగా తమిళనాడు పశ్చిమబెంగాల్ వంటి చోట్ల ఇ డి దాడుల్ని అడ్డుకోవడంతో పాటు ఆ సంస్థ సిబ్బంది పైననే రాష్ట్ర ప్రభుత్వ పక్షాన ఎదురు కేసులు పెట్టే స్థాయికి పరిస్థితి విషమించినదంటే సమాఖ్య స్ఫూర్తికి విఘాతం కలిగినట్లే కదా

**- సమాఖ్య స్ఫూర్తికి విఘాతం కలిగిస్తున్న దర్యాప్తు సంస్థలపై సుప్రీం చురకలు**

అవినీతి కేసుల్లో అత్యున్నత దర్యాప్తును నిలువరించడానికి తమ అధికారిపై లంచం కేసు పెట్టారని, దాన్ని సిబిఐకి బదిలీ చేయాలని, దోషులను శిక్షించాలని ఇడి సుప్రీంను కోరగా "ప్రతీకార చర్యలకు పాల్పడుతూ కేంద్ర దర్యాప్తు సంస్థలు చేసే అరెస్టుల్ని అడ్డుకోవడానికి పారదర్శక యంత్రాంగంతో కూడిన వ్యవస్థ తప్పనిసరి అని సుప్రీంకోర్టు స్పందించిన తీరు దర్యాప్తు సంస్థలఅస్వ తంత్రతను తెలియజేస్తున్నది. ఈ సందర్భంలో కేంద్ర రాష్ట్ర దర్యాప్తు సంస్థలు పరస్పరం అరెస్టులకు పాల్పడితే దేశం పరిస్థితి ఏమిటని ప్రశ్నించిన సుప్రీంకోర్టు అదే సందర్భంలో రాజకీయ కక్ష సాధింపు అన్న ముసుగులో బడా నేరగాళ్లు తప్పించుకుపోతే తీరని ద్రోహం జరుగుతుందని చేసిన హెచ్చరికను కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఆలోచించవలసిన అవసరం ఎంతగానో ఉన్నది. నిర్దోషికి శిక్ష పడితే ఎంత అనాగరిక చర్యనో కరుడుగట్టిన నేరగాళ్లు కూడా ఈ ముసుగులో తప్పించుకుంటే అంతే ద్రోహం జరుగుతుందని ముఖ్యంగా ప్రభుత్వాలు గుర్తించడం చాలా అవసరం. అధికారంలో ఉన్న ప్రభుత్వాలు తమ అనుయాయులను నేర జాబితాల నుండి తప్పించే ప్రయత్నం చేయడం అంటే అధికార దుర్వినియోగానికి పాల్పడడమే. ఈ విషయం పైన సీరియస్ గా స్పందించిన సర్వోన్నత న్యాయస్థానం దర్యాప్తు సంస్థల ఏర్పాటు పని విధానం పైన సంస్కరణ ప్రక్షాళన జరగాల్సి ఉన్నదని సూచన చేసింది. దేశ ప్రజలకు పార్లమెంట్ కు బాధ్యత వహించే విధంగా వీటిని తీర్చిదిద్దాలని వస్తున్న విశ్లేషకుల సూచనలను కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పాటిస్తే మరింత సమయోచితంగా ఉంటుంది .

సిబిఐ ,ఈడి వంటి కేంద్ర సంస్థలకు స్వేచ్ఛ స్వాతంత్ర్యాలు తప్పనిసరి అంటూ 1997లో సుప్రీంకోర్టు ఇచ్చిన చారిత్రాత్మక తీర్పులో "ఈ సంస్థలు దర్యాప్తులో ఎవరి ఒత్తిళ్లకు లొంగరాదు, ఏ రకమైన కారణాలకు ప్రభావితం కాకుండా వ్యవహరించాలి" అని సూచించినప్పటికీ ఆ సంస్థలను కేంద్ర ప్రభుత్వం స్వతంత్రంగా వ్యవహరించేలా ప్రోత్సహించకపోవడం, సందర్భాలను ప్రభుత్వానికి అనుకూలంగా మార్చుకునే క్రమంలో తప్పుడు విధానాలకు, ప్రతీకారచర్యలకు పాల్పడుతున్నట్లు మనం గ్రహించవచ్చు. ఇది రాజ్యాంగ రీత్యా నేరం అని కేంద్రం ఇప్పటికీ గుర్తించకపోతే ఎలా ?

ప్రస్తుతం భారతదేశంలో సిబిఐ ఈడి వంటి సంస్థలు కేంద్ర ప్రభుత్వ పర్యవేక్షణలో విచారణ జరుపుతున్న కారణంగా అనేక ప్రతిపక్షాలకు చెందిన రాజకీయ పార్టీల నాయకులు పెట్టుబడిదారులు ఆందోళన చెందుతున్న విషయం తెలిసిందే. అయితే అవినీతిపరులు ఎవరైనా విచారణ జరగాలి కానీ కేంద్రం డైరెక్షన్, అవకాశవాదం వైపు కొనసాగే ప్రమాదం ఉన్నదని జగన్ కేసు ద్వారా మనకు అర్థమవుతున్నది.

బ్రిటన్ లోనీ" డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్స్" అనే సంస్థ స్వతంత్రంగా వ్యవహరిస్తూ తన ఆధ్వర్యంలో దర్యాప్తు సంస్థలను స్వేచ్ఛగా నడిపిస్తున్న అంశం పైన స్పందించిన సర్వోన్నత న్యాయస్థానం అలాంటి నిష్పాక్షికమైన సంస్థను భారతదేశంలో నియమించి దాని ఆధ్వర్యంలో సిబిఐ, ఇ డి వంటి సంస్థలు పనిచేసే విధంగా రూపకల్పన జరగాలని నిర్దేశించినప్పటికీ ఆ వైపుగా ఎలాంటి చర్యలు కేంద్రం తీసుకోలేదని పలువురు విమర్శిస్తున్న నేపథ్యంలో ఆ నిర్లక్ష్యం ఫలితమే కేంద్ర ప్రభుత్వం పైన ఆరోపణలు, రాజకీయ పార్టీలు కోర్టును ఆశ్రయించడం, దర్యాప్తు సంస్థలు పరస్పరం దాడులు చేసుకోవడం వంటి అపశ్రుతులు చోటుచేసుకోవడం. కొన్ని సంవత్సరాలుగా దేశంలో కొనసాగుతున్న కేసులు, దాడుల తీరును పరిశీలిస్తే 95 శాతం విపక్ష నేతలపైనే అనే ఆరోపణల్లో వాస్తవం ఉందని రాజకీయ పండితులు విశ్లేషకులు అభిప్రాయపడుతున్న వేళ దేశంలో సమాఖ్య స్ఫూర్తిని కాపాడవలసిన గురుతర బాధ్యతను కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఎందుకు సీరియస్ గా తీసుకోవడం లేదో పరిశీలించవలసి ఉన్నది. దర్యాప్తు సంస్థల కూర్పు, వాటి అధినాయకత్వం ఏర్పాటు పూర్తి పారదర్శకంగా స్వతంత్రంగా కొనసాగినప్పుడే ఈ అపశృతులకు అడ్డుకట్ట వేయవచ్చు.

# ఇందిరమ్మ రాజ్యం అంటే ఎన్‌కౌంటర్లు కాల్చివేతలు

-మెదటి తరువాయి

తెలంగాణ బుద్ధి జీవులు, సమాజంలోని అన్ని వర్గాలు ఖండించాలన్నారు. అక్షరంతో ప్రశ్నిస్తే ఆయుధాలతో దాడి చేయడమే ఇందిరమ్మ రాజ్యమా..? దీనిపై సీఎం రేవంత్ సమాధానం చెప్పాలని బాల్క సుమన్ డిమాండ్ చేశారు.

**- సీఎం రేవంత్ రెడ్డిని సాయిరాం రెడ్డి కలిశాకే ఈ దాడి**

చిలుక ప్రవీణ్, రంజిత్, ఆకుల ప్రవీణ్ అనే జర్నలిస్టుల మీద కూడా దాడులు, వేధింపులు జరిగాయని గుర్తు చేశారు. జర్నలిస్ట్ శంకర్ మీద దాడి చేసింది కాంగ్రెస్ కార్యకర్త సాయిరాం రెడ్డి అని సీసీటీవీ ఫుటేజీలో స్పష్టంగా కనిపిస్తోంది. సీఎం రేవంత్ రెడ్డిని సాయిరాం రెడ్డి కలిశాకే ఈ దాడి జరిగింది. శంకర్‌పై దాడికి ముందే సాయిరాం రెడ్డి రెక్కీ నిర్వహించాడు. సాయిరాం రెడ్డి హస్తినపురం కాంగ్రెస్ డివిజన్ అధ్యక్షుడు శశిధర్ రెడ్డి అనుచరుడు అని సుమన్ తెలిపారు. మూడు నెలలు కాకముందే కాంగ్రెస్ పాలనలో అనేక ఆకృత్యాలు చోటు చేసుకుంటున్నాయని పేర్కొన్నారు. నిన్న మేడారంలో సీఎం రేవంత్ ముందే భక్తులపై లాఠీ చార్జీ చేశారు. ఇప్పటి దాకా 2600 మంది బీఆర్ఎస్ కార్యకర్తల మీద అక్రమ కేసులు నమోదు అయ్యాయి. ఇసుక మాఫియా, ల్యాండ్ మాఫియా చెలరేగిపోతుందని ధ్వజమెత్తారు.

**- నయా దేశ్‌ముఖ్ రేవంత్ రెడ్డి**

విసునూరు రామచంద్ర రెడ్డి, ఎర్ర పహాడ్, ప్రతాప్ రెడ్డి లాంటి దేశ్‌ముఖ్‌లలో దళిత బహుజనులు ఎలాంటి దాష్టీకాలు ఎదుర్కొన్నారో ఇప్పుడు నయా దేశ్‌ముఖ్ రేవంత్ రెడ్డి పాలనలో అవే దౌర్జన్యాలు ఎదురవుతున్నాయని తెలిపారు. నయా



దేశ్‌ముఖ్ రేవంత్ రెడ్డి పాలనలో దళిత బహుజన జర్నలిస్టులే లక్ష్యంగా దాడులు జరుగుతున్నాయి. పోలీసులు కూడా అతిగా వ్యవహరిస్తున్నారు. మా వాళ్ళు ఫిర్యాదు చేస్తే చెత్తబుట్టలో వేస్తున్నారు. అధికారం ఎవ్వరికీ శాశ్వతం కాదు. ఇది పోలీసులు గుర్తు పెట్టుకోవాలి.. మేము అన్ని గమనిస్తున్నాం అని బాల్క సుమన్ తెలిపారు. బీఆర్ఎస్‌కు అనుకూలంగా సోషల్ మీడియాలో పోస్టులు పెడితే పోలీసులు ఎందుకు బెదిరిస్తున్నారని సుమన్ ప్రశ్నించారు. కాంగ్రెస్ వాళ్ళు ఏ పోస్టులు పెట్టినా చెల్లుతుందా..? అని నిలదీశారు. నయా దేశముఖ్ రేవంత్ 20, 30 ఏండ్లు అధికారంలో ఉంటారని పోలీసులు అనుకుంటున్నారా..? రేవంత్‌కు మీడియా పట్ల ఎలాంటి చులకన భావంతో ఉండే వారో ఆయన పాత వీడియోలను బట్టి అర్థం చేసుకోవచ్చు. ఇలాంటి పాశవిక హింసాత్మక ధోరణిని రేవంత్ ఇప్పటికైనా మానుకోవాలి అని

# ఎమ్మెల్సీ బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ ను కలిసిన ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు



**తరంగాలు/హన్మకొండ జిల్లా ప్రతినిధి:** ఎమ్మెల్సీ ,టిపిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ మేడారం శ్రీ సమ్మక్క-సారక్క తల్లుల దర్శనానికి వెళ్లి వస్తుండగా మార్గమధ్యలోని ఎన్ఎస్ఆర్ హెూటల్ లో వర్ధన్నపేట శాసనసభ్యులు కేఆర్ నాగరాజు మర్యాదపూర్వకంగా కలిశారు . ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఆర్ గ్రూప్ ఇన్స్టిట్యూషన్స్ అధినేత నాయినేని సంపత్ రావు, గడ్డం శివరాంప్రసాద్, తదితరులు పాల్గొన్నారు

# ఎమ్మెల్యే లాస్య నందిత కుటుంబాన్ని పరామర్శించ

• మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు.

**తరంగాలు/వరంగల్ జిల్లా ప్రతినిధి:** హైదరాబాద్ కంటోన్మెంట్ ఎమ్మెల్యే లాస్య నందిత శుక్రవారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందింది. విషయం తెలుసుకున్న మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు శనివారం ఆమె ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. చిన్న వయసులోనే ఎమ్మెల్యే గా గెలుపొంది ప్రజలకు సేవ చేస్తానని అనుకున్న సమయానికి విధి ఇలా వెంబడించిదా అని మాజీ మంత్రి భావోద్వేగానికి గురి అయ్యాడు. వారి కుటుంబంతో ఉన్న స్మృతులను గుర్తుచేసుకోని ఆ కుటుంబానికి బిఆర్ఎస్ పార్టీ తరుపున, తన తరుపున ఎల్లప్పుడు అండగా ఉంటామని హామీ ఇచ్చాం



# అంతరిక్షంలోకి మనుషులను తీసుకెళ్లడానికి సీఈ20

-మెదటి తరువాయి

అనువైనదిగా రుజువైందనీ ఇది కఠిన పరీక్షలను ఎదుర్కొందనీ ఇక మానవ రహిత యాత్రకు వినియోగించే ఎల్‌వీఎం3 జీ1 లాంచ్ వెహికిల్ కు పరీక్షలు పూర్తయ్యాయి అని ఇస్రో తెలిపింది. గగన్‌యాన్ ప్రయోగంలో భాగంగా వ్యోమగాములను నింగిలో 400 కిలోమీటర్ల ఎత్తున్న కక్ష్యలోకి పంపి మళ్లీ వారిని సురక్షితంగా భూమిపైకి తీసుకురానున్నారు.

# వనంలోకి తల్లులు..

-మెదటి తరువాయి



కుంకుమభరిణెతో సాయంత్రం ప్రారంభమై సూర్యాస్తమయం తర్వాత పూజారులు రాత్రి 7.27 నిమిషాలకు వన ప్రవేశం చేయడంతో జాతర ముగిసింది.

**'మేడారం' బందోబస్తుపై డీజీపీ సంతృప్తి అధికారులు, సిబ్బందికి అభినందనలు**

**తరంగాలు-ప్రత్యేక ప్రతినిధి :** ప్రపంచంలోనే అతిపెద్ద గిరిజన జాతర అయిన మేడారం సమ్మక్క -సారక్క ఉత్సవాన్ని ప్రశాంతంగా నిర్వహిం చినందుకు పోలీసు అధికారులు, సిబ్బందికి రాష్ట్ర డీజీపీ డాక్టర్ రవి గుప్తా అభినందనలు తెలియజేశారు. 21 నుంచి 24 తేదీ వరకు సాగిన ఈ గిరిజన జాతరకు రాష్ట్రం నుంచే గాక దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాల నుంచి లక్షలాది మంది భక్తులు తరలివచ్చారనీ, ఈ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా కట్టుదిట్టమైన భద్రతలను ఏర్పాటు చేయటంలో పోలీసులు అనుసరించిన వ్యూహం మంచి ఫలితాలనిచ్చిందని ఆయన అన్నారు. ఐజీలు మొదలుకొని డీఐజీలు, ఎస్పీలు, అదనపు ఎస్పీలు, డీఎస్పీలు, ఇన్‌స్పెక్టర్లు, ఎస్సైలు, కానిస్టేబుళ్లు, హౌంగార్డుల వరకు ఈ జాతరను విజయవంతం చేయటానికి సమిష్టిగా చేసిన కృషి ఫలించిందని ఆయన కొనియాడారు. భక్తులను తీసుకొచ్చిన లక్షలాది వాహనాల కోసం పార్కింగ్‌ను కూడా ఒక ప్రణాళిక ప్రకారం ఏర్పాటు చేశారని డీజీపీ తెలిపారు. ఈ జాతర విజయవంతానికి ఇతర ప్రభుత్వ శాఖలతో సమన్వయమై పోలీసులు అధికారులు, సిబ్బంది పని చేశారని చెప్పారు. ముఖ్యంగా, లక్షలాది మంది గిరిజనులు కూడా ఈ జాతర ఉత్సాహపూరితంగా, భక్తిమయంగా సాగటానికి పోలీసులకు చక్కటి సహకారాన్ని అందించారని ఆయన మెచ్చుకున్నారు.

# బాధిత రైతులకు నష్టపరిహారం అందించాలి

**•మంత్రి పొంగులేటిని కలిసిన పాలకుర్తి ఎమ్మెల్యే యశస్విని ఝాన్సి రెడ్డి**



**తరంగాలు/తొర్రూరు:** పాలకుర్తి నియోజకవర్గ అభివృద్ధి ని కోరుతూ రెవెన్యూ, గృహనిర్మాణం, సమాచార మరియు పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ని పాలకుర్తి ఎమ్మెల్యే యశస్విని ఝాన్సి రెడ్డి శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పాలకుర్తి నియోజకవర్గంలో చెన్నూరు రిజర్వాయర్ భూములు కోల్పోయిన బాధిత రైతులకు అదేవిదంగా పాలకుర్తి రిజర్వాయర్ బొమ్మర గ్రామంలో భూములు కోల్పోయిన బాధిత రైతులకు వెంటనే నష్టపరిహారం అందేలా చూడాలని, అదే విదంగా పాలకుర్తి నియోజకవర్గ వ్యాప్తంగా అన్ని గ్రామాలలో ఎస్సారెస్పీ కెనాల్ ద్వారా రైతులకు సాగు నీరు అందేలా చూడాలని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిని కోరినట్లు పాలకుర్తి ఎమ్మెల్యే యశస్విని ఝాన్సి రెడ్డి తెలిపారు. సానుకూలంగా స్పందించిన మంత్రి బాధిత రైతులను ఆదుకుంటామని త్వరగా నష్టపరిహారం అందేలా చూడటం తో పాటు పాలకుర్తి నియోజకవర్గ అభివృద్ధికి తోడ్పాటు అందిస్తానని హామీ ఇచ్చారని ఎమ్మెల్యే తెలిపారు.

# ఘనంగా శ్రీ శ్రీ సంత్ సేవాలాల్ మహారాజ్ జయంతి వేడుకలు



**తరంగాలు /మిర్యాలగూడ ప్రతినిధి**



నియోజకవర్గంలో అధికారికంగా మిర్యాలగూడ శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి -బిఎల్ఆర్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించిన గిరిజన ఆరాధ్య దైవం సద్గురు శ్రీ శ్రీ శ్రీ సంత్ సేవా లాల్ మహారాజ్ 285 వ జయంతి వేడుకలు. ఈ సంద్భంగా హౌసింగ్ బోర్డు ప్రభుత్వ జూనియర్ కళాశాల గ్రౌండ్ నుంచి బంజారా భవన్ వరకు శ్రీ సంత్ సేవా లాల్ మహారాజ్ విగ్రహాన్ని బంజారా సోదరులతో ర్యాలీ నిర్వహించడం జరిగింది.. అనంతరం బంజారా భవన్ నందు బోఘ్ నిర్వహించిన శ్రీ సేవాలాల్ మహారాజ్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న డోర్నకల్ ఎమ్మెల్యే రామచంద్రు నాయక్ మాట్లాడుతూ మిర్యాలగూడ నియోజకవర్గంలో బంజారా సోదరులను అందరినీ కలుపుకొని ఇంత అద్భుతంగా మా ఆరాధ్య దైవం సద్గురు శ్రీ శ్రీ శ్రీ సంత్ సేవా లాల్ మహారాజ్ జయంతి వేడుకలు నిర్వహించినందుకు మిర్యాలగూడ ఎమ్మెల్యే లిబత్తుల లక్ష్మారెడ్డి -బి ఎల్ ఆర్ ప్రత్యేక అభినందనలు తెలియజేశారు.. అలాగే మా బంజారా సోదరులకు ఎప్పుడూ అండగా ఉంటున్న లిబిఎల్ఆర్ ఇకపై మేము బత్తుల లక్ష్మానాయక్ గా పిలుచుకుంటాము అన్నారు.. అనంతరం మిర్యాలగూడ శాసనసభ్యులు లిబత్తుల లక్ష్మారెడ్డి - బిఎల్ ఆర్ మాట్లాడుతూ నేను ఈరోజు మిర్యాలగూడ యం ఎల్ ఏ కావడానికి బంజారా సోదరుల కృషి ఎంతో ఉంది ఈ సందర్భంగా బంజారా సోదరులకు అందరికీ ధన్యవాదాలు తెలిపారు... అలాగే అతి త్వరలోనే పెద్దల, పండితుల సలహాలు సూచనలు సేకరించి సంత్ సేవాలాల్ విగ్రహాన్ని ప్రతిష్టిస్తాము అని అన్నారు.. మన సంత్ సేవా లాల్ బాటలో అందరం కలిసిగట్టుగా పనిచేస్తూ అభివృద్ది చేసుకుందాం అని అన్నారు.. ఈ కార్యక్రమంలో అధికారులు , గిరిజన నాయకులు, బంజారా సోదరులు, కాంగ్రెస్ నాయకులు మరియు బిఎల్ఆర్ బ్రదర్స్ పాల్గొన్నారు..

# వైభవంగా స్వయంవ్యక్త శ్రీ వెంకటేశ్వర స్వామి కల్యాణ మహోత్సవం

**•పట్టు వస్త్రాలు సమర్పించిన మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు,ఉషా దంపతులు**





**తరంగాలు/రాయపర్తి:** రాయపర్తి మండలం వెంకటేశ్వర పల్లి (సన్నూర్) గ్రామంలోని శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయం లో స్వయంవ్యక్త శ్రీ వెంకటేశ్వర స్వామి కల్యాణ మహోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు, ఎర్రబెల్లి ఉషాదయాకర్ రావు దంపతులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా స్వామి వారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. అనంతరం స్వామివారినీ దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమం లో ఆలయ కమిటీ సభ్యులు, పార్టీ నాయకులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు

# సమ్మక్క-సారక్క తల్లుల దీవెనలు అందరిపై ఉండాలి

**•ఎంపీ అస్పరెంట్ డాక్టర్ పెరుమాండ్ల రామకృష్ణ**





**తరంగాలు/ములుగు జిల్లా ప్రతినిధి:** సమ్మక్క-సారలక్క తల్లుల దీవెనలు రాష్ట్ర ప్రజలందరి పై ఉండాలని ఆ తల్లులను వెడుకున్నట్లు వరంగల్ ఎంపీ అస్పరెంట్ డాక్టర్ పెరుమాండ్ల రామకృష్ణ తెలిపారు. ములుగు జిల్లా మేడారం సమ్మక్క సారక్క లను ముఖ్యమంత్రి, మంత్రి సీతక్క తో కలిసి రామకృష్ణ దర్శించుకొన్నారు. ఈ సందర్భంగా ఎంపిఆస్పిరెంట్ డాక్టర్ పెరుమాండ్ల రామకృష్ణ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధికారం లోకి రావాలని రేవంతన్న ముఖ్యమంత్రి కావాలన్న కోరికను రేవంతన్న జోడోయాత్ర మేడారం నుండి మొదలు పెట్టిన రోజున మొక్కుకొన్నారు. ఇప్పుడు ఆ తల్లుల మొక్కు తీర్చడం జరిగిందన్నారు. నేను రెసిడెన్షియల్ జాకారంలో విద్యను అభ్యసించే సమయంలో చాలాసార్లు సమ్మక్క సారక్కలను గట్టమ్మ తల్లిని దర్శించుకోవడం జరిగింది. మరియు సమ్మక్క సారక్కలు ఈ ప్రాంతానికి ఎంతో సహాయ సహకారాలు అందజేశారు. వారిని స్ఫూర్తిగా చేసుకోని కూడా కాంగ్రెస్ పార్టీ ద్వారా ఎంతో మంది ప్రజలకు వృత్తిరీత్యా డాక్టర్ అయినందున వైద్య వృత్తిలో పేద ప్రజలకు సేవ చేస్తూ ఇంకా సేవ చేయాలని తపనతో కాంగ్రెస్ పార్టీ అవకాశమిస్తే ప్రజలందరి దీవెనలతో ముఖ్యమంత్రి ఆశీస్సులతో తప్పకుండా రాబోయే పార్లమెంటు ఎన్నికలలో ప్రజలందరి ఆశీస్సులతో పార్లమెంటులో అడుగుపెట్టే అవకాశం వస్తే సమ్మక్క సారక్క లను స్ఫూర్తి గా తీసుకొని వరంగల్ పార్లమెంట్ అభివృద్ధి తో పాటు ములుగు జిల్లా అభివృద్ధికి సీతక్క సహకారం తో విద్య వైద్యానికి తొడ్పాటునందిస్తానని డాక్టర్ రామకృష్ణ అన్నారు. ఈ కార్యక్రమం లో జిల్లా కాంగ్రెస్ నాయకులు వల్లలా జగన్ గౌడ్, కుమ్మరి సంఘము రాష్ట్ర అధ్యక్షులు రవితేజ, బీమాదేవరపల్లి ఎస్సీ సెల్ అధ్యక్షులు కిరణ్, తదితరులు పాల్గొన్నారు.

# రైతులు పండించిన పంటకు కనీసం మద్దతు ధర కల్పించాలి

**-సిపిఎం ఖానాపురం మండల కార్యదర్శి ముంజల సాయిలు**





**ఖానాపురం / తరంగాలు**

మండలం ఆరుగాలం కష్టపడి రైతులు పండించిన ధాన్యానికి వివిధ రకాల పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని కేంద్ర ప్రభుత్వ విధానాలను నిరసిస్తూ ఢిల్లీలో ఆందోళన నిర్వహిస్తున్న రైతులు ఒకవైపు హర్యానాలో యువరైతును బలిగొన్న సంఘటనను దేశం యావత్తు కేంద్రంలోని బిజెపి అనుసరిస్తున్న రైతు వ్యతిరేక విధానాలను వ్యతిరేకిస్తుందని వెంటనే రైతులు పండించిన పంటకు కనీస మద్దతు ధరను ప్రకటించాలని సిపిఎం మండల కార్యదర్శి ముంజల సాయిలు కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు ఈరోజు ఖానాపురం మండల కమిటీ ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వ విధానాలకు నిరసనగా పోలీసు కాల్పుల్లో మరణించిన యువరైతు రాక్పాల్ సింగ్ పోలీసులు హత్య చేయడానికి నిరసనగా ఖానాపురం మండల కమిటీ ఆధ్వర్యంలో నిరసన చేపట్టడం జరిగింది ఈ నిరసన కార్యక్రమాన్ని ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ గతంలోని రైతుల పండించిన పంటలకు మద్దతు ధర ఇవ్వాలని విద్యుత్తు చట్టాన్ని వెనక్కి తీసుకోవాలని మార్కెట్ చట్టాన్ని వెనక్కి తీసుకోవాలని కనీసం మద్దతు ధరనిర్ణయించాలని కోరుతూ గతంలోనే 13 నెలలపాటు ఆందోళన చేసిన ఫలితంగా రైతు వ్యతిరేక చట్టాలను వెనక్కి తీసుకున్న ప్రభుత్వం మళ్లీ ఆ చట్టాలను ముందుకు తీసుకువచ్చి కార్పొరేట్ శక్తులకు వ్యవసాయ రంగాన్ని కట్టబెట్టే ప్రయత్నం చేస్తున్న ఈ తరుణంలో ఢిల్లీ పరిసర ప్రాంతాల్లో పంజాబ్ హర్యానా ఉత్తరప్రదేశ్ ఢిల్లీ ఇతర ప్రాంతాల నుంచి లక్షలాది మంది రైతులు కేంద్ర ప్రభుత్వ విధానాలను నిరసిస్తుంటే రైతులపై పోలీసులు భాష్ప వారి గోళాలు నీటి ఫిరంగులు జరుపుతూ లాటి చార్జీలు చేస్తూ రైతులను భయాందోళన గురి చేస్తున్నారు కేంద్ర ప్రభుత్వం ఎన్నికల ముందు అనేక హామీలను ఇచ్చి రైతులను మోసం చేసిందని ఆయన అన్నారు దేశంలోని రైతాంగం రోజు రోజుకు దివాలా తీస్తున్నారని దివాలా తీస్తున్నారని రైతాంగాన్ని ఆదుకోవడానికి కేంద్ర ప్రభుత్వం ఇప్పటివరకు ఎలాంటి చర్యలు చేయలేదని కానీ పోరాడే రైతులపై తుపాకీ ఎక్కువేటి రైతులను చంపడం ఏంటని ఆయన విమర్శించారు బిజెపి ప్రభుత్వం రైతు వ్యతిరేక విధానాలను ఇలాగనే నిర్వహిస్తే రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో కేంద్రంలోని బిజెపి ప్రభుత్వానికి పార్టీకి ప్రజలు తగిన బుద్ధి చెప్పాలని ఆయన పిలుపునిచ్చారు రైతాంగం కేంద్రంలో బిజెపి ప్రభుత్వం ఏర్పడ్డ నాటి నుండి దళారుల చేతిలో దోపిడీకి గురవుతూ పండించిన పంటల ఉత్పత్తులను అమ్ముకోలేక వారు ఆధారపడిన భూములను అమ్ముకొని రైతులు పట్టణ ప్రాంతాలకు వలసలు వెళుతున్నారని ఆయన అన్నారు కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం వచ్చిన తర్వాత పంట ఉత్పత్తి కోసం కొనుగోలు చేయాల్సిన ఎరువులు పురుగుమందులు అలాగే పంటచేళ్లలో పనిచేసే వ్యవసాయ కూలీల కూలి రేట్లు అన్ని విపరీతంగా పెరిగిపోయి రైతు పండించిన పంటకు మాత్రం సరైన గిట్టుబాటు రాక పెట్టిన పెట్టుబడి రాక రైతులు రోజురోజుకు ఆత్మహత్య చేసుకుంటూ ఉన్న కొద్దో గొప్ప భూములను అమ్ముకొని పట్టణ ప్రాంతాలకు వలసలు వెళ్లి సెక్యూరిటీ గార్డులుగా అనేక మంది రైతులు పనిచేస్తున్నారని ఆయన అన్నారు రైతును దివాళించే విధానాలను వెనక్కి తీసుకొని రైతుకు గిట్టుబాటు ధరలు నిర్వహించి న్యాయం చేయకపోతే కేంద్రంలోని బిజెపి ప్రభుత్వానికి ప్రజలు తగిన రీతిలో బుద్ధి చెప్తారని ఆయన అన్నారు ఈ సమావేశంలో ప్రజాసంఘాల పార్టీల నాయకులు గాదరి మల్లయ్య బసనబోయిన సోమయ్య రవిచారి కొత్తపెల్లి రాజేందర్ రమేష్ మన్నూరు సుధాకర్ వీరయ్య శోభన్ సాంబయ్య ఇతరులు పాల్గొన్నారు.

# పొంగులేటి ప్రసాద్ రెడ్డి పర్యటన షురూ

**పలు శుభకార్యాలకు హాజరవుతూ ముందుకు**



**తరంగాలు/ఖమ్మం జిల్లా బ్యూరో ఖమ్మం :** నేలకొండపల్లి:కాంగ్రెస్ జిల్లా నాయకులు పొంగులేటి ప్రసాద్ రెడ్డి పాలేరు నియోజకవర్గ పర్యటన శనివారం ప్రారంభమైంది. హైదరాబాద్ నుంచి బయల్దేరి ఉదయం 9:30 గంటలకు సూర్యాపేట జిల్లా కోదాడ చేరుకున్నారు. ప్రసాద్ రెడ్డి, శ్రీలక్ష్మి దంపతులకు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు.సమీపంలోని తమ్మర శ్రీ సీతారామ ఫంక్షన్ హాల్ లో నాచేపల్లి కి చెందిన రాయల రమేష్ కుమార్తె వివాహ వేడుకకు హాజరై వధూవరులు రాయల లావణ్య సాయికృష్ణ లను ఆశీర్వదించారు. అక్కడి నుంచి పైనంపల్లి గ్రామానికి వెళ్లి గ్రామ పంచాయతీ గుమస్తా దండారపు సైదులు కుమారుడు ఉపేందర్ వివాహం ఇటీవల జరగ్గా..కొత్త జంటను ఆశీర్వదించారు. గువ్వలగుడెం లో వేముల వెంకట నర్సయ్య కుమారుడు ప్రుద్వీకృష్ణ వివాహం సందర్భంగా..ప్రసాద్ రెడ్డి, శ్రీలక్ష్మి వారి నివాసానికి వెళ్లి ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ వజ్జా రమ్య, ఎం పీ టీ సీ దోసపాటి కల్పన, రేగురి వాసవి, నాయకులు నెల్లూరి భద్రయ్య, కొడాలి గోవిందరావు శాఖమూరి రమేష్ ,వెన్నపూసల సీతారాములు, మామిడి వెంకన్న, కొప్పుల హనుమంతరావు, వంగవీటి నాగేశ్వరరావు, బచ్చలికూర నాగరాజు, ఎంపీటీసీలు తేజావత్ కోటేశ్వరరావు బొద్దు బొందయ్య మరికంట రమేష్ తదితరులు పాల్గొన్నారు

# అమ్మవారి కుంకుమ భరిణె అంత పవిత్రంగా. "తెలంగాణ రాష్ట్రాన్ని కాపాడుకుంటాం

**-మంత్రి కొండా సురేఖ...**



**తరంగాలు/హన్మకొండ జిల్లా ప్రతినిధి:** అమ్మవారి కుంకుమ భరిణె అంత పవిత్రంగా తెలంగాణ రాష్ట్రాన్ని కాపాడుకుంటామని మంత్రి కొండా సురేఖ అన్నారు. మేడారం సమ్మక్క, సారలమ్మ జాతరను భక్తులు అనుక్షణం ఆస్వాదించేలా, జాతరను విజయవంతంగా నిర్వహించడంలో భాగస్వాములైన అందరికీ కృతజ్ఞతలు తెలిపారు. జాతర ఏర్పాట్లు, నిర్వహణలో అన్నిశాఖలు పరస్పర సహకారంతో, సమన్వయంతో వ్యవహరించి, చిత్తశుద్ధిని కనబరచి మహా జాతరను దిగ్విజయం పూర్తి చేశామన్నారు.సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాలతో మంత్రులు, ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు జాతర పనులను ముందు నుంచే ప్రణాళికాబద్ధంగా చేపట్టడంతో భక్తులు అమ్మవార్లను ప్రశాంతంగా దర్శించుకొని, మొక్కులు చెల్లించుకొని, సంతృప్తితో తిరుగు ప్రయాణమయ్యారని మంత్రి వెల్లడించారు. ప్రభుత్వం భక్తులకు అడుగడుగునా అన్ని వసతులను కల్పించేందుకు శాయశక్తులా ప్రయత్నం చేసిందని మంత్రి స్పష్టం చేశారు.కోట్లాదిగా పోటెత్తిన ఈ మహాజాతరలో తెలిసీ తెలియక భక్తులు ఏమైనా ఇబ్బందులకు గురైతే పెద్ద మనసుతో క్షమించాలని కోరారు. దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రిగా మొదటిసారి మేడారం జాతర నిర్వహణ, పర్యవేక్షణ బాధ్యతను పూర్తి నిష్టతో చేపట్టినట్లు తెలిపారు. అమ్మవారి దయతో అనారోగ్యాన్ని జయించి, త్వరగా కోలుకొని అమ్మవార్లు గద్దెలకు చేరుకున్నాక దర్శించుకునే భాగ్యం కలిగిందన్నారు. సమ్మక్క-సారక్క దయతో తెలంగాణ ప్రజలపై సదా ఉండాలని ఈ సందర్భంగా మంత్రి ఆకాంక్షించారు.

# బస్తి సంపర్క్ అభియాన్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి

**• రాష్ట్ర ఎస్సీ మోర్చా అధ్యక్షులు కొండేటి శ్రీధర్**



**తరంగాలు/హైదరాబాద్/:** భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కార్యాలయంలో మాజీ శాసన సభ్యులు,రాష్ట్ర ఎస్సీ మోర్చా అధ్యక్షులు కొండేటి శ్రీధర్ అధ్యక్షతన కార్యవర్గ సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా కొండేటి శ్రీధర్ నూతనంగా నియమింపబడిన కమిటీ సభ్యులకు తో పాటు రాష్ట్రంలోని జిల్లా ఎస్సీ మోర్చా అధ్యక్షులకు శుభాకాంక్షలు తెలియజేశారు. మొదటి సమావేశానికి హజరైనందుకు కృతజ్ఞతలు తెలిపారు. అదేవిధంగా వచ్చే నెలలో జరిగే బస్తి సంపర్క్ అభియాన్,యువ సంవద్ కార్యక్రమాలను జిల్లాలోని ప్రతి గ్రామంలో జరిగేలా చర్యలు తీసుకుని పక్కాగా జరిగేలా ప్రణాళిక తయారు చేసి దానికనుగుణంగా బస్తి సంపర్క్ అభియాన్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఎస్సీ మోర్చా పథాధికారులు,జిల్లా ఎస్సీ మోర్చా అధ్యక్షులు పాల్గొన్నారు.

# విద్యార్థులు మేధస్సుకు పదును పెట్టినప్పుడే అద్భుతాలు సృష్టిస్తారు

-సమ్మె గౌడ్ విద్యార్థులను ఉన్నత స్థాయిలో నిలబెట్టేది చదువే
-సమ్మిగౌడ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం,కళాశాల విద్యార్థులకు ప్యాడ్ లు,రాత కిట్టు పంపిణీ
-పదవ తరగతి, ఇంటర్మీడియట్లో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు సమ్మిగౌడ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నగదు బహుమతి అందజేస్తామన్న సమ్మి గౌడ్
-విద్యార్థుల పట్ల సమ్మి గౌడ్ కి ఉన్న స్పందన చూసి అభినందించిన కేజీ విబి ఎస్ఓ నీలిమ
-ప్రతీ విద్యార్థి క్రమశిక్షణ తో చదువుకుని ఉన్నత స్థాయిని చేరుకోవాలి: ఎస్ జి ఎఫ్ గౌరవ సలహాదారులు సామల నర్సయ్య
-సమాజం పట్ల సమ్మిగౌడ్ ఫౌండేషన్ సేవలు హర్షణీయం చాగంటి రాములు, వీరేందర్



తరంగాలు/కేసముద్రం/ చదువుకు పేద,ధనిక అనే భేదాలు లేవని మంచి మేధా సంపత్తితో ఒక లక్ష్యాన్ని ఎంచుకొని ముందుకు సాగాలని సమ్మిగౌడ్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు ,గోపా డివిజన్ అధ్యక్షులు చిలువేరు సమ్మయ్య గౌడ్ అన్నారు. కేసముద్రం మండలంలోని తిమ్మంపేట గ్రామం శివారులో ఉన్న కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం, కళాశాలలో ప్రిన్సిపాల్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశ కార్యక్రమం లో సమ్మిగౌడ్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు చిలువేరు సమ్మయ్యగౌడ్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో సమ్మిగౌడ్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు చిలువేరు సమ్మయ్యగౌడ్ మాట్లాడుతూ, విద్యార్థులు తమ యొక్క లక్ష్యాన్ని ఎంచుకొని ఆ లక్ష్యం దిశగా ప్రయాణిస్తూ ఉన్నత శిఖరాలను అధిరోహించాలని దానికి పేద,ధనిక మధ్య తరగతి అనేవి అడ్డు కాదని బురద గుంటలో పెరిగే తామర పువ్వు కూడా చివరికి దేవుని పాదాల వద్దకు చేరినట్లు ఉన్నతమైన చదువుతో కూడిన ప్రతి విద్యార్థి గొప్ప స్థాయిలో ఉన్నతమైన స్థితిలో ఉంటాడని అన్నారు. విద్యార్థులను ప్రోత్సహించడానికి సమ్మిగౌడ్ ఫౌండేషన్ ఎల్లప్పుడు మీకు అందుబాటులో ఉంటుందని,పేదరికంలో ఉన్నటువంటి ఏ విద్యార్థి అయినా మా ఫౌండేషన్ ను సంప్రదించినట్లయితే వారి యొక్క బంగారు భవిష్యత్తుకు ఆర్థిక సహాయం చేస్తూ వారికి చేదోడు వాదోడుగా ఉంటుందని ఈ సందర్భంగా తెలియజేశారు. అదేవిధంగా ఫౌండేషన్ సలహాదారులు సామల నర్సయ్య మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణ తో ఉన్నపుడే వారి జీవితంలో అన్ని రంగాలలో ఉత్తమ ఫలితాలు సాధించవచ్చుని సూచిస్తూ,సమ్మిగౌడ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సమ్మిగౌడ్ చేస్తున్న సేవలను అభినందించారు.అనంతరం విద్యార్థులకు పరీక్ష ప్యాడ్,రాత పరీక్షకు సంబంధించిన సామగ్రి కిట్టును ప్రిన్సిపాల్, ఉపాధ్యాయ బృందం ఆధ్వర్యంలో సమ్మిగౌడ్ ఫౌండేషన్ తరపున పదవ తరగతి విద్యార్థులకు 29 ఇంటర్మీడియట్ విద్యార్థులకు 12 అందజేశారు. ఈ సందర్భంగా పాఠశాల,కళాశాల స్పెషల్ ఆఫీసర్ నీలిమ మాట్లాడుతూ విద్యార్థుల ప్రోత్సహించేందుకు విచ్చేసినటువంటి సమ్మిగౌడ్ ను అభినందిస్తూ ,ఇలాంటివారు సమాజంలో ఉండటం వల్లనే



పేద విద్యార్థులకు ఒక భరోసా కలుగుతుందని, విద్య పట్ల ఉన్నతమైన ఆలోచనలతో మంచి స్థాయికి ఎదుగుతారని అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో చాగంటి రాములు, వీరేందర్ ,కేజీ బీవీ సి ఆర్ టి లు ఎన్. సుష్మ, ఎస్.కె రహిమా, పీజీ సీ ఆర్ టి లు సృజన,అనిత,అపర్ణ, అకౌంటెంట్ స్నేహలత, ఏఎన్ఎం వసంత, హెల్త్ డిపార్ట్మెంట్ బి.శ్రీనివాస్, తిమ్మంపేట జిపి కారోబార్ మందుల పెంటయ్య, ఆశా కార్యకర్తలు లకావత్ కవిత, జాటోత్ జ్యోతి, సీనమ్మ,పొన్నం కవిత కళాధర్ తదితరులు పాల్గొన్నారు.

## సీసీ రోడ్డు పనులను ప్రారంభించిన మండల పార్టీ అధ్యక్షులు అల్లం నాగేశ్వర్‌రావు




తరంగాలు/కేసముద్రం/ కేసముద్రం మండలం తౌర్య తండ గ్రామ పంచాయతీ పరిధిలోని దుబ్బ తండాలో ఎం జి ఎన్ ఆర్ ఈ జి ఎస్, నిధుల నుండి మంజూరు అయిన 5 లక్షల విలువ చేసే రెండు సీసీ రోడ్లన మహబూబాబాద్ శాసనసభ్యులు డాక్టర్ భూక్య మురళి నాయక్ ఆదేశాల మేరకు శనివారం సీసీ రోడ్ల పనులను ప్రారంభించిన కాంగ్రెస్ పార్టీ కేసముద్రం మండల అధ్యక్షులు అల్లం నాగేశ్వర్ రావు ఈ కార్యక్రమంలో తర్య తండా మాజీ సర్పంచ్ శ్రీనివాస్,సీనియర్ నాయకులు బండారు దయాకర్,గ్రామ పార్టీ అధ్యక్షుడు గుగులోతు రాము, మాజీ ఉప సర్పంచ్ వాంకుడోత్ మంగమ్మ, మాజీ గ్రామ పార్టీ అధ్యక్షులు ముడావత్ రామ్ చంద్రు, భూక్య రామ్ తండ గ్రామ పార్టీ అధ్యక్షుడు జాటోత్ రమేష్, కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ వాంకుడోత్ బాబులాల్, మాజీ వార్డు సభ్యులు శ్రీధర్, మాలోత్ హర్య, వాంకుడోత్ సునీత రాజు, వాంకుడోత్ వాగ్య, తండ నాయకులు వీరన్న, అశోక్, మైబు, రాము, భీమా తదితరులు పాల్గొన్నారు..

## గీత కార్మికుడికి శస్త్ర చికిత్స



తరంగాలు .తొర్రూరు డివిజన్ కేంద్రంలోని కటాయపాలెం గ్రామానికి చెందిన గీత కార్మికుడైన కామ గాని సోమయ్య తండ్రి ఎల్ల గౌడ్ వయసు 58 సంవత్సరములు ఇటీవల తాడిచెట్టు పై నుండి జారిపడి తీవ్ర గాయాలు అయిన విషయం తెలిసినదే. వృత్తిలో భాగంగా ప్రతిరోజులాగే కల్లు తీయడానికి వెళ్లి మంగళవారం రోజున తాటి చెట్టు పై నుండి జారి కింద పడి తీవ్ర గాయాలు కాగా కుటుంబ సభ్యులు తొర్రూర్ లోని ప్రైవేట్ కు ఆసుపత్రికి తరలించగా శస్త్ర చికిత్స కోసం హనుమకొండ లోని ప్రైవేట్ హాస్పటల్ కు తరలించారు. చేయి విరగడంతో డాక్టర్ల సూచన మేరకు బుధవారం రోజున చేయికి డాక్టర్లు శాస్త్ర చికిత్స చేశారు, వృత్తినే నమ్ముకుని జీవిస్తున్న అతి నిరుపేద కుటుంబానికి పెద్ద దిక్కు సోమయ్య వృత్తిరీత్యా ప్రతిరోజు కల్లు తీస్తేనే కుటుంబం గడిచే పరిస్థితి కావున వారి కుటుంబాన్ని ఆదుకోవాలని కుటుంబ సభ్యులు కోరుతున్నారు.

## నూతన వధూవరులను ఆశీర్వదించిన దొంతి



నర్సంపేట / తరంగాలు
వరంగల్ లోని పిడిఎర్ ఫంక్షన్ హాల్లో నెక్కొండ మండలం చంద్రుగొండ గ్రామానికి చెందిన మూల పద్మాకర్ రెడ్డి కుమార్తె వివాహానికి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించిన నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవ రెడ్డి పిసిసి సభ్యులు సొంటి రెడ్డి రంజిత్ రెడ్డి, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బక్కి అశోక్, జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి హరీష్ రెడ్డి నెక్కొండ పట్టణ అధ్యక్షులు పెండ్యాల హరిప్రసాద్ మండల కాంగ్రెస్ నాయకులు కుసుమ చెన్నకేశవులు మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు రావుల మైపాల్ రెడ్డి,చంద్రుగొండ కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## గాంధీ భవన్ వద్ద నిరుద్యోగుల ఆందోళన



హైదరాబాద్ తరంగాలు : కాంగ్రెస్ ప్రభుత్వంపై రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజల నుంచి రోజురోజుకు అసంతృప్తి పెరుగుతున్నది. తాజాగా గాంధీ భవన్ వద్ద అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ అభ్యర్థులు ఆందోళన చేపట్టారు. 'హాలో నిరుద్యోగి-చలో గాంధీ భవన్' పేరిట చేపట్టిన ఆందోళనలో అభ్యర్థులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. టీఎస్‌పీఎస్సీ నిర్వహించిన ఏఈఈ పరీక్ష ఫలితాలను ప్రకటించి పార్లమెంట్ ఎన్నికల కోడ్ రాకముందు అపాయింట్‌మెంట్ ఆర్డర్స్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు పీసీసీ అధికార ప్రతినిధి భవానీరెడ్డికి వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సమస్యను సీఎం రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

## వాణిజ్య నౌకలపై కొనసాగుతున్న దాడులు

●పెరిగిపోతున్న దాడులు ఆందోళనలో ప్రపంచ దేశాలు



తరంగాలు న్యూఢిల్లీ : గల్ఫ్ ఆఫ్ ఏడెన్‌లో వాణిజ్య నౌకలపై దాడులు కొనసాగుతున్నాయి. పైరేట్స్ తరచుగా ఈ నౌకలను లక్ష్యంగా దాడులు చేస్తున్నారు. సముద్రంలో నౌకలపై దాడులు పెరిగిపోతుండడం ప్రపంచ దేశాలకు ఆందోళన కలిగించే అంశంగా మారింది. గత కొన్ని రోజులుగా భారతీయ నావికాదళం అనేక కార్యకలాపాలలో సముద్రపు దొంగల నుంచి వ్యాపార నౌకలను రక్షించింది. గల్ఫ్ ఆఫ్ అడెన్‌లో మరోసారి ఒక వ్యాపారి నౌకపై అనుమానాస్పద డ్రోన్ దాడి చేసింది. ఈ సమయంలో ఓడకు భారతీయ యుద్ధనౌక సహాయం చేసింది. సముద్రపు దొంగల దాడుల మధ్య భారత నావికాదళం నిరంతరం సహాయ సహకారాలు అందిస్తోంది. ఎంవీ ఐలాండర్ అనుమానిత డ్రోన్‌తో దాడి చేశాడు. పలావ్ ఫ్లాగ్డ్ షిప్ ఎంవీ ఐలాండర్‌పై గురువారం దాడి జరిగిందని భారత సైనిక అధికారులు తెలిపారు. ఈ సమయంలో ఓడ సిబ్బందిలో ఒకరికి గాయాలయ్యాని చెప్పారు. నౌకాదళ బృందం ఓడలోకి ఎక్కి అక్కడ ఉన్న సిబ్బందిని రక్షించిందని అధికారులు చెప్పారు. ఎర్ర సముద్రంలోని అనేక వాణిజ్య నౌకలపై హౌతీ తిరుగుబాటుదారులు జరిపిన దాడులపై ప్రపంచవ్యాప్త ఆందోళనలు పెరుగుతున్న నేపథ్యంలో ఈ తాజా ఈ ఘటన చోటు చేసుకున్నది. గాయపడిన సిబ్బందికి భారత నావికాదళానికి చెందిన వైద్య బృందం ఎంవీ ద్వీపంలోకి వెళ్లి వైద్య సహాయం అందించింది. ఓడ నుంచి అత్యవసర కాల్ వచ్చిందని, దానికి ప్రతిస్పందించిన భారత నావికా దళాలు కార్గో షిప్‌ను రక్షించాయని పేర్కొన్నారు. భారత నావికాదళ ప్రతినిధి కమాండర్ వివేక్ మధ్వల్ మాట్లాడుతూ భారత నౌకాదళం నౌకల ప్రయత్నాలు వాణిజ్య నౌకలు, నావికుల భద్రత పట్ల బలమైన నిబద్ధతను పునరుద్ఘాటిస్తుందన్నారు.

## ఆ భయంతోనే పవన్‌కళ్యాణ్ పార్టీకి 24 సీట్లు

● రామ్ గోపాల్ వర్మ సెటైర్‌లు



తరంగాలు అమరావతి : ఆంధ్రప్రదేశ్‌లో ఎన్నికల కోసం జనసేనతో పొత్తు పెట్టుకున్న టీడీపీ.. ఆ పార్టీకి కేవలం 24 సీట్లు కేటాయించడంపై సినీ దర్శకుడు రామ్‌గోపాల్ వర్మ తనదైన శైలిలో స్పందించారు. ఒక్క సీటు కిందికైనా, ఒక్క సీటు మీదికైనా పవన్‌కళ్యాణ్ మీద ట్రోల్స్ ఖాయమనే భయంతోనే పవన్ పార్టీకి 24 అసెంబ్లీ స్థానాలు కేటాయించారని ఆయన ఎద్దేవా చేశారు. ఈ మేరకు ఆయన తన అధికారిక ఎక్స్ ఖాతాలో ఒక పోస్ట్ పెట్టారు. పొత్తులో భాగంగా జనసేనకు టీడీపీ 24 అసెంబ్లీ, మూడు లోక్‌సభ స్థానాలు కేటాయించింది. శనివారం ఉదయం టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు నాయుడు, జనసేన అధ్యక్షుడు పవన్‌కళ్యాణ్ ప్రెస్‌మీట్ పెట్టి ఎవరెన్ని స్థానాల్లో పోటీ చేస్తున్నారో వెల్లడించారు. ఈ నేపథ్యంలో జనసేనకు కేవలం 24 సీట్లే కేటాయించడంపై సినీ దర్శకుడు రామ్ గోపాల్ వర్మ సెటైర్‌లు వేశారు. జనం ట్రోల్ చేస్తారనే భయంతోనే పవన్ పార్టీకి 24 సీట్లు కేటాయించారని ఎద్దేవా చేశారు. '23 సీట్లిస్తే టీడీపీ లక్కీ నెంబర్ అని ట్రోల్ చేస్తారు. 25 సీట్లిస్తే పావలాకి పావలా సీట్లు ఇచ్చారని ట్రోల్ చేస్తారు. అందుకే మధ్యే మార్గంగా 24 సీట్లు ఇచ్చారు' అని ఆర్జీవీ సెటైర్లు వేశారు. జనసేనకు కేవలం 24 సీట్లు మాత్రమే కేటాయించడంపై సోషల్ మీడియాలో తీవ్రస్థాయిలో విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. జనసేన లేకుంటే టీడీపీ గెలువదంటూ గతంలో చెప్పిన పవన్ కళ్యాణ్.. ఇప్పుడు 24 అసెంబ్లీ, 3 లోక్‌సభ స్థానాలతో సరిపెట్టుకోవడం అంటే జనసేన కార్యకర్తలను అవమానించడమేనని నెటిజన్‌లు విమర్శిస్తున్నారు.

## తెలంగాణ ప్రణాళికా సంఘం ఉపాధ్యాక్షుడిగా చిన్నారెడ్డి నియామకం



తరంగాలు హైదరాబాద్ : తెలంగాణ ప్రణాళిక సంఘం ఉపాధ్యాక్షుడిగా మాజీ మంత్రి జి చిన్నారెడ్డి నియామకం అయ్యారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రణాళిక సంఘం ఉపాధ్యాక్షుడిగా నియాకమైన చిన్నారెడ్డి కేబినెట్ హోదాను కలిగి ఉండనున్నారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో వనపర్తి నియోజకవర్గం నుంచి చిన్నారెడ్డి పేరును కాంగ్రెస్ పార్టీ ప్రకటించింది. కానీ అంతలోనే చిన్నారెడ్డి పేరును తొలగిస్తూ మేఘా రెడ్డికి కాంగ్రెస్ పార్టీ అవకాశం కల్పించింది. మేఘా రెడ్డి.. నిరంజన్ రెడ్డిపై భారీ మెజార్టీతో గెలుపొందారు. జి చిన్నారెడ్డి వనపర్తి నియోజకవర్గం నుంచి మూడుసార్లు ఎమ్మెల్యేగా గెలుపొందారు. 1985లో యువజన కాంగ్రెస్ నేతగా ఉన్న చిన్నారెడ్డి.. వనపర్తి నియోజకవర్గంలో పోటీ చేసి టీడీపీ అభ్యర్థి బాలకృష్ణయ్య చేతిలో ఓటమి పాలయ్యారు. 1989లో మళ్లీ పోటీ చేసి బాలకృష్ణయ్యపై విజయం సాధించి, తొలిసారి శాసనసభలో అడుగుపెట్టారు చిన్నారెడ్డి. 1994 ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థి రావుల చంద్రశేఖర్ రెడ్డి చేతిలో ఓడిపోయారు. 1999 ఎన్నికల్లో రావుల చంద్రశేఖర్ రెడ్డిపై చిన్నారెడ్డి 3,500 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. 2004 ఎన్నికల్లోనూ గెలుపొందారు. వైఎస్సార్ కేబినెట్‌లో గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రిగా పని చేశారు. 2009 ఎన్నికల్లో రావుల చేతిలో ఓటమి పాలయ్యారు చిన్నారెడ్డి. 2014 ఎన్నికల్లో చిన్నారెడ్డి గెలుపొందారు. మొత్తంగా నాలుగు సార్లు ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు చిన్నారెడ్డి. 2018 ఎన్నికల్లో నిరంజన్ రెడ్డి చేతిలో ఓడిపోయారు.

## అధికారుల బదిలీలపై ఈసీఐ ఆదేశాలు జారీ

● ఒకే పార్లమెంటు నియోజకవర్గంలో ఉండకూడదని ఈసీఐ స్పష్టం

అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న సందర్భంగా




తరంగాలు అమరావతి: ఆంధ్రప్రదేశ్‌లో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న సందర్భంగా అధికారుల బదిలీలపై భారత ఎన్నికల సంఘం ఆదేశాలు జారీ చేసింది. ఎన్నికల నిబంధనల్లో భాగంగా మూడేళ్లు సర్వీసు దాటిన అధికారులు.. ఒకే పార్లమెంటు నియోజకవర్గంలో ఉండకూడదని ఈసీఐ స్పష్టం చేసింది. ఈ తరహా కేసులను తీవ్రంగా పరిగణిస్తామని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలకు ఆదేశాలు జారీ చేసింది. మార్గదర్శకాల ప్రకారం అధికారుల పోస్టింగ్.. రెండు వేర్వేరు జిల్లాలకు జరిగినా, ఒకే పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో ఉండకూడదని స్పష్టం చేసింది. కొన్ని రాష్ట్ర ప్రభుత్వాలు ఉద్దేశపూర్వకంగా బదిలీలు చేస్తే తగిన చర్యలు తీసుకోవాల్సి వస్తుందని హెచ్చరించింది. సదరు అధికారులు ఎన్నికల విధులకు ఆటంకం కలిగించకుండా ఈసీఐ పటిష్టమైన చర్యలు చేపడుతుందని తెలిపింది. అధికారుల బదిలీలు రెండు వేర్వేరు పార్లమెంటు నియోజకవర్గాల్లో ఉండేలా చూడాలని రాష్ట్రాలకు సూచించింది. ఎన్నికల నిబంధనల మేరకు బదిలీ చేసినట్టు మభ్యపెట్టకుండా యథాతథంగా అమలు చేయాలని తేల్చి చెప్పింది. ఇప్పటివరకూ చేసిన అన్ని బదిలీలకూ ఈ ఆదేశాలు వర్తిస్తాయని పేర్కొంది. ఎన్నికలతో సంబంధం ఉన్న వారితో పాటూ పర్యవేక్షణ స్థాయిలో ఉన్న అధికారులు ఒకే ప్రాంతంలో మూడేళ్లుగా ఉంటే.. బదిలీ చేయాల్సిందేనని ఈసీఐ తేల్చి చెప్పింది. ఎన్నికల్లో సమాన అవకాశాలు లేకుండా చేసే వారిపట్ల ఏమాత్రం ఉపేక్షించేది లేదని తెలిపింది. ఇటీవల అసెంబ్లీ ఎన్నికలు పూర్తైన 5 రాష్ట్రాల్లో సీనియర్ స్థాయిలోని అధికారులపైనా బదిలీ వేటు వేసినట్టు స్పష్టం చేస్తూ.. భారత ఎన్నికల సంఘం నోట్ విడుదల చేసింది.